
సాక్షి గుంటూరు

మంగళవారం ; 29 ; అక్టోబర్ ; 2024



వెల్లటూరులో పారాయణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కొలువైన కట్లమ్మ తల్లి దేవస్థానంలోని అభ యాంజనేయస్వామి ఆలయంలో సోమవారం పారాయణ కార్యక్రమం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6908 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1748 క్యూసెక్కులు వదిలారు.

విఘ్నేశ్వరునికి వెండి కిరీటం



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో విఘ్నేశ్వరస్వామికి హైద రాబాద్‌కు చెందిన పరిమి రామనరసిం హం రూ.1.20 లక్షల విలువైన వెండికిరీటాన్ని సోమవారం సమర్పించారు. అనంతరం విఘ్నే శ్వరునికి కిరీటాన్ని అలంకరించారు.

న్యూస్‌రీల్


గుంటూరు డీఆర్వోగా ఖాజావలి

గుంటూరు వెస్ట్ : జిల్లా రెవెన్యూ అధికారిగా షేక్ ఖాజావలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గుంటూరు డీఆర్వోగా పనిచేస్తున్న పెద్దిరోజాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం గుంటూరు డీఆర్వోగా జి.శ్రీనివాసులును నియమించారు. ఆయన విధుల్లో చేరలేదు.

రేపు చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో అక్టోబర్ 30న బుధవారం డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాను జిల్లాలోని ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిప్లమా, ఐటీఐ లేదా డిగ్రీ ఆపైన అర్హత కలిగిన వారు మేళాలో పాల్గొనాలని వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.

యార్డుకు 63,735 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 63,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 54,065 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,400 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 28,584 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

మొసలి సంచారం



మాచవరం: వేమవరం సమీపంలోని చెక్‌డ్యాం వద్ద రహదారిపై మొసలి సంచరించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం రాత్రి సమయంలో గ్రామస్తులు వాహనాలపై ప్రయాణిస్తుండగా మొసలి రహదారిపైకి వచ్చి చెట్ల పొదల్లోకి వెళుతుండగా, ప్రయాణికులు సెల్‌ఫోన్లో వీడియో తీసి అధికారులకు సమాచారం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగుల్లోకి వరదనీరు అధికంగా రావడంతో మొసళ్లు వస్తున్నాయని, అటవీశాఖ అధికారులు స్పందించి, ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్తెనపల్లి పట్టణంలోని టాక్సీస్టాండ్‌లో జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గార్లపాటి సునీల్‌బాబు ఉత్సాహంగా పాల్గొన్నారు. సునీల్‌బాబు ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా సత్తెనపల్లి మండలం భృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పట్టణంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల్గొని, రాజకీయనాయకులతో వేదికను పంచుకోవటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధి జపం

డబ్బులేదట పాపం



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో మంత్రి మనోహర్, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు

- ఎమ్మెల్సీ లక్ష్మణరావుపై ధూళిపాళ్ల కస్సుబస్సు
- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రశ్నలకు అరకొర సమాధానాలు
- తూతూమంత్రంగానే జిల్లా సమీక్ష సమావేశం

గుంటూరు వెస్ట్: రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడిన నాలుగు నెలల తర్వాత సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష(డీఆర్‌సీ) సమావేశం తూతూ మంత్రంగా సాగింది. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న కూటమి ప్రజాప్రతినిధులు ఆద్యంతం అభివృద్ధి జపం చేస్తూనే డబ్బుల్లేవని బీదార్పులు పోయారు. ముఖ్యంగా సమావేశంలో పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం, ఇరిగేషన్ తదితర అంశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కౌలు రైతుల



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సమస్యలపై మాట్లాడుతుండగా పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అడ్డు తగిలారు. ఎమ్మెల్సీపై కస్సుబుస్సులాడారు. ఎమ్మెల్సీని ఉద్దేశించి మాట్లాడుతూ రైతులపై మాట్లాడే హక్కుపై కావాలంటే పేటెంట్ తీసుకోండని, తమను తక్కువ చేయొద్దని మండిపడ్డారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు కౌలు రైతులకు జారీ చేసిన సీసీఆర్సీ కార్డుల సంఖ్య చెబుతుండగా, మీరు చెబుతున్నదానికి డీఆర్సీ బుక్‌లో నమోదు చేసిన సంఖ్యకు తేడా ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. అనంతరం కందుల దుర్గేష్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానం పాటించాలంటూనే ఇంకా ఇండస్ట్రియల్ పాలసీ రాలేదని చెప్పారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. అయితే నిధుల విషయం ప్రస్తావించలేదు. గుంటూరు చానల్ పొడిగింపు కోసం రూ.274 కోట్లు పాలనా అనుమతులు లభించాయని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తన పరిధిలోని ఆటోనగర్, మానస సరోవరం, పరిశ్రమలకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానాలు కరువయ్యాయి.

ఎమ్మెల్యేలు డుమ్మా

తన నియోజకవర్గ పరిధిలోనే జరిగిన జిల్లా సమీక్ష సమావేశానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి గైర్హాజరయ్యారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కూడా రాలేదు. మంగళగిరి నుంచి ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ పాల్గొన్నా.. ఆమె పెద్దగా మాట్లాడలేదు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాకు కూడా మాట్లాడే అవకాశం కల్పించలేదు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దురేష్ లోతుల్లోకి వెళ్లకుండా సమావేశాన్ని ముగించారు.

డీఈఓగా సీవీ రేణుక బాధ్యతల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖాధికారిగా సీవీ రేణుక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె స్వస్థలం కడప జిల్లా. విద్యాభ్యాసం అనంతపురంలో కొనసాగింది. 2008లో వైజాగ్ ఉప విద్యాశాఖాధికారిగా విద్యాశాఖలోకి ప్రవేశించిన ఆమె అక్కడే రెండుసార్లు ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో ఉద్యోగోన్నతిపై పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారిగా పోస్టింగ్ పొందిన రేణుక 2022లో గత ప్రభుత్వం చేపట్టిన నూతన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాకు ప్రథమ డీఈవోగా బదిలీపై వచ్చారు. అనంతరం గత మేనెలలో ప్రభుత్వం ఆమెను పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్‌లో డెప్యూటీ డైరెక్టర్‌గా నియమించింది. తాజాగా రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా గుంటూరు డీఈఓగా వచ్చిన రేణుక తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బదిలీ అయిన పి.శైలజ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసింతో పాటు ఎంఈవోలు, సీనియర్ హెచ్‌ఎంలు, కార్యాలయ ఉద్యోగులు రేణుకకు శుభాకాంక్షలు తెలిపారు.



డీఈఓ రేణుకకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, ఎంఈఓలు ఖుద్దూస్, తిరుమలేష్ తదితరులు

మున్సిపల్ టీచర్ల ప్రమోషన్లకు షెడ్యూల్ విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు షెడ్యూల్ విడుదల చేసినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడిపినేని వెంకట్రావు, బొనిగల హైమారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రేడ్-2 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు నవంబర్ ఒకటో తేదీ వరకు సీనియార్టీ జాబితాల విడుదలతో పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. నవంబర్ 4న తుది సీనియార్టీ జాబితా విడుదల చేసి, ఆరో తేదీన గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు, 8న అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఉద్యోగోన్నతుల ప్రక్రియ అడ్‌హక్ పద్ధతిలో చేపడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని వివరించారు.

ముత్తాత పుల్లరి వీరుడు..

మనవడు టెక్నాలజీ ధీరుడు



ఎనిమిది దేశాల సైనికాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

- తెనాలి తేజం రమేష్‌బాబు
- మానవ రక్షణ అధ్యయన సంస్థ సీహెచ్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడిగా అంతర్జాతీయ గుర్తింపు

తెనాలి: హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న ఏకైక మానవ రక్షణ అధ్యయన సంస్థ సీహెచ్‌ఎస్‌ఎస్ 12 ఏళ్లుగా లాభాపేక్ష లేని ఎన్జీఓగా, థింక్‌ట్యాంక్‌గా అనేక సేవలందిస్తోంది. ఈ సంస్థను నెలకొల్పింది మన తెనాలి తేజం డాక్టర్ కన్నెగంటి రమేష్‌బాబు. ఈయన టెక్నాలజీ రంగంలో చేసిన కృషితో అంతర్జాతీయ గుర్తింపు సాధించారు. ఈనెల 25న ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, యూఏఈ వంటి ఎనిమిది దేశాల సీనియర్ మిలటరీ అధికారులు సీహెచ్‌ఎస్‌ఎస్‌ను సందర్శించి చైనా ప్రాబల్యం నుంచి హిందూ, పసిఫిక్ మహాసముద్రాల జలాలను కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీతో ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై చర్చించారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ హ్యూమన్ సెంటర్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31 వరకు జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు సీహెచ్‌ఎస్‌ఎస్ ఆహ్వానం అందుకోవడం విశేషం.

ఇంటర్ ఫెయిలైనా.. మొక్కవోని దీక్షతో

సీహెచ్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కన్నెగంటి రమేష్‌బాబు ఒకప్పుడు ఇంటర్ ఫెయిలైన కుర్రోడు. చదువు విలువ, తల్లిదండ్రుల ఆశలను గుర్తెరిగి మళ్లీ పుస్తకాలు పట్టారు. పేదరికం, ఆకలి బాధలు ఎదురైనా స్కాలర్‌షిప్‌లతో చదివారు. బీఏ డిస్టింక్షన్‌లో పాసయ్యారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ చేశారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జేఎన్‌యూ)లో 'యూఎస్-ఆస్ట్రేలియా సెక్యూరిటీ రిలేషన్స్'పై ఎంఫిల్ చేశారు. 2002-03లో ఇజ్రాయెల్‌లోని హిబ్రూ యూనివర్శిటీలో 'ఇంటర్నేషనల్ రిలేషన్స్' చదివారు. జేఎన్‌యూలో 2006లో 'యూఎస్-ఇజ్రాయెల్ సెక్యూరిటీ రిలేషన్స్ ఇన్ ది పోస్ట్ కోల్డ్‌వార్ ఎరా'పై పీహెచ్‌డీ చేశారు. తర్వాత ఇజ్రాయెల్‌లోని బార్-ఇలాన్ యూనివర్శిటీలో 'యూఎస్-ఇజ్రాయెల్-ఇండియా స్ట్రాటెజిక్ రిలేషన్స్' (టెర్రరిజాన్ని ఓడించటానికి మూడు దేశాల త్రిముఖ వ్యూహం)'పై పోస్ట్‌డాక్టోరల్ ఫెలోషిప్ చేశారు.

స్నేహితులు, పలు సంస్థల సాయంతో..

ముంబయిలో వరుస పేలుళ్లు, తర్వాత బాబ్రీ మసీదు కూల్చివేత పరిణామాలతో రమేష్‌బాబు దృష్టి మానవ భద్రతపైకి మళ్లింది. ఉగ్రవాదం, తీవ్రవాదం, పేదరికం, నిరక్షరాస్యతను టెక్నాలజీ సాయంతో ఎదుర్కోవటంపై అధ్యయనం సాగించారు. 2013లో హైదరాబాద్‌లో మానవ రక్షణ అధ్యయన సంస్థ (సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్)ను కొందరు స్నేహితులు, సంస్థల సాయంతో ఆరంభించారు. ఐఐటీ, నల్సార్ లా యూనివర్శిటీతో సహా పలు యూనివర్శిటీలు, ఆంధ్ర, తెలంగాణ పోలీసులతో ఎంఓయూలను కుదుర్చుకుంది. ఎస్‌ఐ నుంచి ఐపీఎస్‌ల వరకు 1200 మంది సైబర్ సెక్యూరిటీ, కౌంటర్ టెర్రరిజంపై ఈ సంస్థ నుంచి శిక్షణ తీసుకున్నారు. 12 వేలమంది రీసెర్చ్ ఇంటర్న్‌షిప్‌లు చేశారు. దీంతో యూఎస్ ప్రభుత్వం రమేష్‌బాబును 'ఇంటర్నేషనల్ విజిటల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం' కింద ఆహ్వానించింది. ఉన్నతవిద్యలో భాగంగా మూడుసార్లు ఇజ్రాయెల్ ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో అక్కడకు వెళ్లిన ఏకైక తెలుగువాడు రమేష్‌బాబు. ప్రస్తుత భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ దగ్గర పనిచేసిన ఏకైక తెలుగు వ్యక్తి కూడా.



డాక్టర్ కన్నెగంటి రమేష్‌బాబు

మానవ భద్రత పాఠ్యాంశం కావాలి

స్వాతంత్య్ర ఉద్యమకాలంలో జరిగిన పుల్లరి ఉద్యమంలో పోరాడి పోలీసు కాల్పుల్లో అమరుడైన కన్నెగంటి హనుమంతు ముని మనవడే రమేష్‌బాబు. ఆయన మనవడిగా తనకు సమాజంపై శ్రేయస్సుపై స్పృహ ఉందంటారు డాక్టర్ రమేష్‌బాబు. మానవ భద్రత అంశాన్ని పాఠశాల స్థాయిలోనే పాఠ్యాంశంగా చేర్చాలంటారాయన.

ఓడరేవుల రక్షణపై అధ్యయనంతోనే ఆహ్వానం

'కృత్రిమ మేధ మానవ రక్షణకు ఎలా ఉపకరించాలి' అనే విభాగాన్ని ఇటీవలే సీహెచ్‌ఎస్‌ఎస్‌లో నెలకొల్పారు. స్మార్ట్ పోలీసింగ్, దేశంలోని తొమ్మిది కోస్తా రాష్ట్రాల్లో గల 7,516 కిలోమీటర్ల తీరప్రాంతంలోని 12 మేజర్, 180 మైనర్ పోర్టులను కలుపుతూ ఓడరేవుల రక్షణపై 'మిషన్ 7,516'ను రూపొందించారు. దీంతో స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం లభించింది.

అవినీతి అగ్ని

- దీపావళి ధమాకా
- అగ్నిమాపక శాఖ అధికారుల చేతివాటం
- జిల్లాలో ఓ ఉన్నతాధికారి కీ రోల్
- 90 నుంచి వంద వరకు బాణసంచా షాపులు, 20కిపైనే భారీ గోడౌన్లు
- ఒక్కో షాపు నుంచి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు
- గోడౌన్ల నుంచి రూ.2 లక్షల వరకు డిమాండ్
- అధికారులకు, వ్యాపారులకు మధ్య ఘర్షణలు?
- పోలీసు, రెవెన్యూ అధికారులకూ కప్పం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అగ్నిమాపక శాఖ అధికారులకు దీపావళీ ధమాకా మొదలైంది. ఎన్‌ఓసీల జారీలో భారీగా చేతివాటం చూపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా స్థాయి అధికారి నుంచి ఆయా ఫైర్ స్టేషన్ అధికారి వరకు ముడుపులు సమర్పించాల్సి వస్తోందని వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

భారీగా డిమాండ్

గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయం ఉంది. గుంటూరు 1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు ప్రాంతాల్లో సబ్ ఫైర్ స్టేషన్‌లు ఉన్నాయి. దీపావళి పండుగను పురస్కరించుకుని ఏటా జిల్లా వ్యాప్తంగా ఖాళీ మైదానాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే విషయం విదితమే. ఈ క్రమంలో నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)ల జారీ విషయంలో అగ్నిమాపక శాఖ అధికారులు భారీ అవినీతికి తెరలేపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దుకాణల ఏర్పాటు విషయంలో ముందుగా ఫైర్ అధికారులు పరిశీలించి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన తరువాత, పోలీసులు, రెవెన్యూ అధికారులు అనుమతులు జారీ చేస్తారు. అయితే ఎన్‌ఓసీల జారీలో అగ్నిమాపక అధికారులు భారీగా డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది.



మంగళగిరిలో పెట్రోల్ బంక్ వద్ద దసరా మామూళ్ళు తీసుకుంటున్న ఫైర్ సిబ్బంది

కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు..

జిల్లా వ్యాప్తంగా 90 నుంచి 100 వరకు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్‌ఓసీల జారీ విషయంలో ప్రతి దుకాణదారుని దగ్గర నుంచి రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు అధికారులు వసూలు చేస్తున్నారని సమాచారం. దీనికితోడు అధికారుల దగ్గర పనిచేసే అసిస్టెంట్‌లు, డ్రైవర్లకు రూ. 3వేలు చొప్పున ముట్టచెబితేనే అయ్యగారి సంతకం జరుగుతోందట. జిల్లాలో ఏర్పాటైన సుమారు 20పైనే భారీ బాణాసంచా గోడౌన్ల వద్ద ఒక్కో యజమాని నుంచి రూ.2 లక్షలకుపైగానే వసూలు చేస్తున్నట్టు సమాచారం. దీంతో పాటు ముందుగా ఫైర్ అధికారుల సూచన మేరకు చాలా మందికి బాణ సంచా ప్యాకింగ్‌లు చేసి పంపాల్సి వస్తోందని తెలుస్తోంది.



గుంటూరు గుంటగ్రౌండ్స్‌లో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలు

అంతా బయటే

బాణ సంచా షాపుల ఎన్‌ఓసీల జారీ అంతా బయటే జరుగుతోంది. ఫైర్‌స్టేషన్ల వద్దకు వ్యాపారులను అధికారులు రానివ్వడం లేదని సమాచారం. రెండు రోజుల క్రితం తెనాలిలో ఏర్పాటు చేస్తున్న దుకాణాల వద్ద వర్షపు నిలిచి ఉండటంతో మోటార్ల ద్వారా తోడించాలని వ్యాపారులు కోరారు. అయితే తమకేమీ సంబంధం లేదని అధికారులు కరాఖండీగా చెప్పారు. దీంతో డబ్బులు వసూలు చేసి తమకేమీ తెలీదని చెప్పడమేమిటని వ్యాపారులు ఘర్షణకు దిగినట్టు తెలుస్తోంది. ఎన్‌ఓసీలను తెనాలి స్టేషన్ దగ్గర కాకుండా ఓ కళాశాలలో ఇచ్చి వసూళ్లు చేశారని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. గతంలో తెనాలిలో పనిచేసిన ఒక అధికారి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆయన ప్రస్తుతం గుంటూరులో పనిచేస్తున్నారు. వసూళ్ల దందాకు డ్రైవర్ నియమించుకున్నారని సమాచారం. ఇప్పటికే నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో బాణసంచా దుకాణాల విషయంలో అధికారులు, సిబ్బంది చేతివాటంపై ఆ శాఖ డీజీ చర్యలు తీసుకున్నా.. జిల్లా ఫైర్ అధికారుల తీరులో మార్పు రావటంలేదు. దీనిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఇదిలా ఉంటే పోలీసు, రెవెన్యూ అధికారులకూ మామూళ్లు సమర్పించుకోవాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం

బాణసంచా విక్రయదారుల నుంచి ఎటువంటి అవినీతికి పాల్పడవద్దని ఇప్పటికే జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. చేతివాటానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అవినీతికి పాల్పడిన వారి వివరాలపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అవినీతికి పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. శాఖాపరమైన చర్యలు తప్పవు.

– ఎండీ జిలాని, రేంజ్ ఫైర్ ఆఫీసర్

దసరా మామూళ్లు రూ.20 లక్షలపైనే వసూలు

అగ్నిమాపక సిబ్బంది, అధికారులు దసరా మామూళ్లూ వసూలు చేశారని సమాచారం. పెట్రోల్ బంకులు, కమర్షియల్ భవనాలు, ఆసుపత్రుల నుంచి పుస్తకాలు పెట్టుకెళ్లి మరీ సుమారు రూ. 20 లక్షలకుపైగా వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో మంగళగిరి ప్రాంతం సమీపంలో ఒక పెట్రోల్ బంకుకు సంబంధించి ఎన్‌ఓసీ జారీ చేసే విషయంలో జిల్లా స్థాయి అధికారి ఒకరు విజిట్ చేసి రూ.50వేలు తీసుకున్నారని, ఈ క్రమంలో అక్కడి అధికారికి, జిల్లా స్థాయి అధికారికి మధ్య ఘర్షణ జరిగిందని సమాచారం.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రమణ యశస్వి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి సూపరింటెండెంట్(ఫుల్ అడిషనల్ చార్జ్)గా ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్విని నియమిస్తూ సోమవారం రాష్ట వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జీజీహెచ్ ఫుల్ అడిషనల్ చార్జ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా నియమించారు. యశస్వి ఆంధ్ర మెడికల్ కాలేజీలో 1982లో ఎంబీబీఎస్, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో 1991లో ఆర్థోపెడిక్ పీజీ వైద్య విద్య పూర్తి చేశారు. తిరుపతి బర్డ్స్‌లో 1994 నుంచి 1997 వరకు ఆర్థోపెడిక్ వైద్యుడిగా సేవలందించారు. గుంటూరు జిల్లాలోని నిజాంపట్నం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిగా 1997లో విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులో చేరారు. గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1998లో విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా 2012లో, ప్రొఫెసర్‌గా 2017లో ప్రమోషన్ పొందారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ రమణ యశస్వికి సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ లభించింది. మంగళవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా
తెనాలి మార్కెట్‌యార్డులో
సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,000**
గరిష్టం : రూ. **3,100**
మోడల్ ధర రూ. **2,500**

బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

పెనమలూరు: తాడిగడపలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. తాడిగడప రైస్ మిల్లు సమీపంలో 15 ఏళ్ల బాలిక తల్లిదండ్రులతో నివసిస్తోంది. ఆ బాలికకు ఇన్‌స్టాగామ్‌లో పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కన్నేగంటి సంపత్‌కుమార్‌తో పరిచయమైంది. సంపత్‌కుమార్ తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని, వివాహం చేసుకుంటానని బాలికను నమ్మించాడు. ఈనెల 25న బాలిక సోదరుడితో కలిసి బయటకు రాగా సంపత్‌కుమార్ కారులో వచ్చి ఆమెను కారులో ఎక్కించుకొని తీసుకు వెళ్లిపోయాడు. ఈ విషయం బాలిక సోదరుడు తల్లిదండ్రులకు తెలిపాడు. తల్లిదండ్రులు బాలికకు, సంపత్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి

మాచర్ల: పట్టణంలోని 15వ వార్డులో నివాసం ఉంటున్న యామిని (35) పది రోజులుగా జ్వరంతో బాధపడుతూ పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. డెంగీ లక్షణాలు కనిపించడంతో ఆసుపత్రి వైద్యులు వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. యామినిని బంధువులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

గుంటూరు వెస్ట్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ, జీఎంసీ తదితర శాఖల్లో అభివృద్ధి పనులు అనుకున్నంత వేగంగా సాగడంలేదన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం కొరవడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. కొన్ని అర్జీలు తూతూ మంత్రంగా పరిష్కరించి మూసేస్తున్నారని చెప్పారు. అధికారుల తీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం వచ్చిన 211 ఫిర్యాదులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

టీడీపీ నాయకుడి భూకబ్జాలపై ఫిర్యాదు

పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామంలో టీడీపీ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని, తగిన చర్యలు తీసుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ పొన్నూరు మండల అధ్యక్షుడైన బండ్లమూడి బాబూరావు కొడుకు బండ్లమూడి చింపిరయ్య మన్నవ గ్రామ పంచాయతీ పరిధిలోని డి.నెం. 412-4లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాడని తెలిపారు. ఆ భూమిలో గుడిసె వేసి బిల్ కలెక్టరు వాకా శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రెటరీ దార్ల లక్ష్మీ నారాయణ సంతకాలను ఫోర్జరీ చేసి, అసెస్మెంట్ నంబరు 66తో నకిలీ ఇంటి పన్ను రశీదును సృష్టించాడని వివరించారు. వాస్తవానికి మన్నవ గ్రామ పంచాయతీ డిమాండ్ రిజిస్టర్‌లో అసెస్మెంట్ నంబర్ 66 బండ్లమూడి బాబూరావు పేరుపై ఉందని, ఆయన తన ఇంటికి పన్ను చెల్లించినట్లు పంచాయతీ రికార్డులో ఉందని వెల్లడించారు. ఆ ప్రభుత్వ స్థలం తన పూర్వీకుల ఆస్తిగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, వాటి ఆధారంగా విజయవాడలోని ఒక ఫైనాన్స్ కంపెనీలో రూ. 5 లక్షల రుణం తీసుకున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయటమేగాక, ఫైనాన్స్ కంపెనీని మోసగించి అక్రమంగా రుణం తీసుకున్న బండ్లమూడి చింపిరయ్యపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాగమల్లేశ్వరరావు కోరారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

భూమి కాజేతకు యత్నం



నాకు మా గ్రామంలో 5 సెంట్ల ఇంటి స్థలముంది. స్థానిక వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మరికొందరు కలిసి నా భూమిని కాజేయడానికి చూస్తున్నారు. నాకు రిజిస్ట్రేషన్‌తోపాటు కోర్టు నుంచి వచ్చిన అనుకూల తీర్పు ఉంది. పేద దళితురాలిని. న్యాయం చేయండి.

– పి.చిన్నమ్మ, వేములూరిపాడు, ఫిరంగిపురం మండలం

వరదలతో నష్టపోయాం ఆదుకోండి

ఇటీవల వరదలు, భారీ వర్షాల వల్ల బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో 600 ఇళ్లల్లోకి నీరు వచ్చింది. వాహనాలతోపాటు ఇళ్ళు, వస్తువులు దెబ్బతిన్నాయి. గత వారం వస్తే వారంలో సిబ్బందిని పంపిస్తామన్నారు. కనీసం పట్టించుకోలేదు. పేదల కష్టమంటే ఇంత అలుసు సరికాదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.



– జయసుధ సామాజిక కార్యకర్త, బొంగరాల బీడు వాసులు

రక్తదానంతో ప్రాణదాతలుకండి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా నగరంపాలెం పోలీస్ కల్యాణ మండపంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వద్దని చెప్పారు. రక్తదానం చేసేందుకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది, యువకులు, విద్యార్థులను అభినందించారు. విధి నిర్వహణతోపాటు ఆరోగ్యంపై పోలీసులు శ్రద్ధవహించాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ప్రముఖ వైద్యులతో వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించి చికిత్స అందించారు. గుంటూరు జీజీహెచ్, ఆంధ్ర ప్రైమ్ ఆసుపత్రి, రమేష్ ఆసుపత్రి, ఒమేగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు శాంతకుమార్ (ఏఆర్), బి.సీతా రామయ్య (ఎస్‌బీ), ఆర్ఐలు హరిరెడ్డి, శివరామకృష్ణ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లను నమోదు చేయండి

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అర్హులైన ఓటర్లను నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కోసం దరఖాస్తులను వచ్చేనెల 6 వరకు స్వీకరిస్తామన్నారు. ఓటరుగా నమోదు కావడానికి 2021 నవంబరు 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. గతంలో ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు అయినా పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. ప్రతి ఒక్కరూ మళ్లీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఫారం -8 ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఏఈఆర్వో, డీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేసి ఓటరుగా నమోదు చేయాలన్నారు. జిల్లా కార్యాలయాల హెచ్ఓడీలు తమ సిబ్బందిని ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 39 వేల దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ్, డీఆర్వో పెద్దిరోజా, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు పాల్గొన్నారు.

నేడు సిరిపురంలో ఉమ్మడి జిల్లాస్థాయి పరుగు పందెం

మేడికొండూరు: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పరుగు పోటీలు జరగనున్నట్లు తెలిపారు. 14 ఏళ్లలోపు బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. గుంటూరు ఉమ్మడి జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచి సుమారు 750 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి వెల్లడించారు.

మోసపోయా'మనీ' ఆవేదన

- పోలీసు గ్రీవెన్స్‌లో పలువురి ఫిర్యాదు
- తక్షణం పరిష్కరించాలని ఎస్పీ ఆదేశం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): చిట్టీలు కట్టి, అప్పులు ఇచ్చి, ప్లాట్లు కొని మోసపోయామనీ పలువురు ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఫిర్యాదిదారుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, డీఎస్పీలు సుబ్బారావు (మహిళా పీఎస్), శివాజీరాజు (సీసీఎస్) కూడా అర్జీలు స్వీకరించారు.


బాధితుల సమస్య ఆలకిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

చిట్టీ నిర్వాహకురాలి మోసం



ఇరవై ఏళ్లుగా ఓ మహిళ రూ.2 లక్షల నుంచి రూ.ఐదులక్షల వరకు చిట్టీలు వేసేది. నమ్మకంగా ఉండడంతోపాటు అధిక వడ్డీలు ఆశ చూపడంతో డబ్బులిచ్చాం. చిట్టీ పాటలు ముగిసినా నగదు, వడ్డీలు చెల్లించ లేదు. ఆమె ఫోన్ పనిచేయడం లేదు. ఇంటికెళ్తే రెండు నెలలు క్రితమే వెళ్లిపోయినట్లు తెలిసింది. కుమార్తె పెళ్లి నిమిత్తమని, ఇతర భవిష్యత్తు అవసరాలకు పనికొస్తాయని ఆమెకు డబ్బులిచ్చాం. ఒక్కొక్కరికి ఆమె చిట్టీ, వడ్డీ రూపేణా రూ.ఐదు లక్షల నుంచి ఏడు లక్షలకు పైగా ఇవ్వాలి. చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చింది. వాటి వల్ల ప్రయోజనంలేదు. న్యాయం చేయండి సార్.

– కోట పద్మ, ఆర్.అంజలి, షేక్.నాగుల్‌మీరా, ఎ.పద్మ, పి.గిరిజారాణి తదితరులు నల్లచెరువు

ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరిస్తోంది

ఓ మహిళా స్వయం సహాయక సంఘం తరుపున 2021లో చౌత్రాసెంటర్‌లోని ఓ బ్యాంక్‌లో రూ.8 లక్షల రుణం తీసుకున్నాం. ప్రతి నెలా రూ.40 వేలు, రూ.2 వేలు పొదుపు చెల్లించాల్సి ఉంది. ఓ సభ్యురాలి ద్వారా రుణం, పొదుపు చెల్లించే వాళ్లం. 2023 ఫిబ్రవరి వరకు రూ.6.50 లక్షలు చెల్లించినట్లు పాస్ బుక్‌లో ఆధారాలున్నాయి. తరువాత నుంచి సరిగా చెల్లించడంలేదు. చెల్లించాల్సిన రూ.1.50 లక్షలు, ఆమె రుణం రూ.40 వేలు, పొదుపు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంది. రూ.3.90 లక్షలు చెల్లించాలని ఆమెను అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరిస్తోంది.

– గ్రూప్ సభ్యులు ఎం.గౌతమిభాగ్యశ్రీ, ఎం.రమణకుమారి, సిహెచ్.శ్రీదేవీ, కె.లత తదితరులు, శారదాకాలనీ.

మా ప్లాట్లు మాకు ఇప్పించండి

చాన్నాళ్ల క్రితం ఆర్ అగ్రహారం శ్మశానాల వెనుక ఐదు ఎకరాలలో ఎనభై వరకు ప్లాట్లు వేశారు. వాటిని విడివిడిగా కొనుగోలు చేశాం. ప్లాట్లు అమ్మిన వ్యక్తి కాలం చేశారు. అతని మనవళ్లు స్థలం వద్దకు వచ్చి ఇది తమదని, తమ తాత సంతకం ఫోర్జరీ చేశారని మమ్మలను బెదిరిస్తున్నారు. రెండు రోజుల క్రితం అందులో మెరకకు మట్టి తొలిస్తున్నారని తెలిసి అక్కడికెళ్తే బెదిరింపులకు దిగారు. మా ప్లాట్లు మాకు ఇప్పించి న్యాయం చేయండి.

– బాధితులు టి.శ్రీనివాసరావు, మధుబాబు, కుర్రా శ్రీనివాసరావు, పి.శ్రీనివాసగుప్తా, ఎస్‌వీ.బాబు, బి.శ్రీనివాసరావు ఆర్అగ్రహారం, గుంటూరు

అప్పు తిరిగి ఇవ్వడం లేదు


వృద్ధాప్యం పైబడటంతో కుమార్తె వద్ద ఉంటున్నా. రెండేళ్ల క్రితం ఇంటి వద్ద తెలిసిన ఆమెకు రూ.40 వేలు ఇచ్చాను. ఆర్థిక పరిస్థితి సరిగాలేదని డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగాను. ఆమె నుంచి సరైన సమాధానం లేదు. డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతోంది. న్యాయం చేయగలరు.

– కె.కోటమ్మ, ఏటీఅగ్రహారం, 10వ వీధి, గుంటూరు


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గుంటూరు జట్ల జయకేతనం


విన్నర్స్‌గా నిలిచిన గుంటూరు జిల్లా బాలుర జట్టు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలురు, బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లా జట్లు విజయకేతనం ఎగురవేశాయి. బాలుర విభాగంలోనూ, బాలికల విభాగంలోనూ గుంటూరు జిల్లా జట్టు ఫైనల్స్‌లో తమ ప్రత్యర్థి జట్లను ఓడించి, విన్నర్స్‌గా నిలిచాయి. ఈనెల 26న స్థానిక స్టేడియం మైదానంలో ప్రారంభమైన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు రన్నర్స్ స్థానాన్ని కైవసం చేసుకోగా, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. బాలికల విభాగంలో కృష్ణాజిల్లా జట్టు రన్నర్స్‌గా నిలవగా, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం జరిగిన సభలో రోటరీక్లబ్, తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకట పూర్ణచంద్, స్వర్ణ హోటల్ అధినేత సుధీర్‌బాబు, గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం.రవి, అసిస్టెంట్ సెక్రటరీ బి.రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ వినయ్‌కుమార్‌లు విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, మెడల్స్‌ను బహూకరించారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన తెనాలి డబుల్‌హార్స్ యాజమాన్యానికి, రోటరీ క్లబ్‌కు, స్వర్ణ హోటల్‌కు నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు. టోర్నమెంటు ముగిసిన తదుపరి, నవంబరు నెలాఖరులో ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు.


గుంటూరు జిల్లా బాలికల జట్టు

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: నాటు సారాకు ఉపయోగించే బెల్లం ఊటను మండలంలోని జంపనివారిపాలెంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది సోమవారం ధ్వంసం చేశారు. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో సిబ్బంది జంపనివారిపాలెం గ్రామ శివారులోని అడవుల్లో దాడులు నిర్వహించారని తెలిపారు. ఇందులో ఏడు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో 700ల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితులు పరారయ్యారని, త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో నాటు సారా కాచినా, విక్రయించినా తమకు ప్రజలు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్స్ వెంకటరమణ, పి.శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, డ్రైవర్ భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

మార్కెట్ యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రజని



తాడికొండ: సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు తరుపున పత్తి కొనుగోళ్లు మంగళవారం నుంచి ప్రారంభించనున్నామని తాడికొండ మార్కెట్ యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పి రజని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7521 చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు సీసీఐ కేంద్రానికి పంటను తీసుకెళ్లాలంటే ముందుగా రైతు సేవా కేంద్రాల వద్ద ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ అందజేయాల్సి ఉంటుందన్నారు. తేమ శాతం 8-12 శాతం మాత్రమే ఉన్న పత్తిని కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. తడిచిన, రంగు మారిన పత్తిని కొనుగోలు చేయరని స్పష్టం చేశారు. ఈ పంట/ ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు/ కౌలు రైతులు మాత్రమే పత్తి కొనుగోలు కేంద్రానికి రావాలని వెల్లడించారు. అన్ని అర్హతలు ఉన్న రైతులు గుంటూరు శివారు పత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామంలోని శివసాయి టీఎంసీ సిండికేట్ మిల్లుకు పంటను తీసుకొస్తే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పత్తి కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుందరాచారి



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం డాక్టర్ సుందరాచారి మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో 1981లో ఎంబీబీఎస్ చదివి, అనంతరం న్యూరాలజీ పీజీ చేసి 2001లో జీజీహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా గుంటూరు జీజీహెచ్‌లో పనిచేశారు. గత ఏడాది రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డును ఈయన అందుకున్నారు. న్యూరాలజీ విభాగాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ విభాగంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో స్లీప్ ల్యాబ్, స్ట్రోక్ యూనిట్ ఏర్పాటుచేసి నాణ్యమైన వైద్య సేవలతో 2018లో ఐఎస్ఓ గుర్తింపు సైతం న్యూరాలజీ వార్డుకు లభించడంలో డాక్టర్ సుందచారి కృషి ఎనలేనిది. 2022లో ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీగా ఎన్నికై అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఈఏడాది జనవరిలో డాక్టర్ సుందరాచారికి అడిషనల్ డీఎంఈగా ప్రమోషన్ ఇచ్చి మచిలీపట్నం వైద్య కళాశాలకు బదిలీ చేశారు. ఇప్పుడు తిరిగి గుంటూరు వైద్య కళాశాలకు బదిలీ చేశారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉత్తర్వులు అందుకున్న డాక్టర్ సుందరాచారికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని మార్టూరు జాతీయ రహదారిపై నూలుమిల్లు సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. తెనాలికి చెందిన పగడాల కుమార్ (45) ద్విచక్ర వాహనంపై తిరుగుతూ వస్త్ర వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తెనాలి నుంచి నెల్లూరుకు బైకుపై బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో మార్టూరు జాతీయ రహదారిపై నూలు మిల్లు సమీపంలో వాహనం అదుపుతప్పి రెండు రోడ్ల మధ్యగల డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో కుమార్ బైక్ సహా ఎగిరి అటువైపు ఒంగోలు నుంచి మార్టూరు వైపు వెళ్లే రోడ్డుపై పడిపోయాడు. ప్రమాద తీవ్రతకు కుమార్ తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు కుమార్‌కు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసిన ఏఎస్ఐ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శవ పంచనామా చేయించి బంధువులకు అప్పగించారు.